సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం । 21 । మార్చి । 2025



సహాయక చర్యలు వేగవంతం
ఎస్ఎల్‌బీసీ సొరంగంలో రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నాయి.

వివరాలు IIలో ▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-29 (శుక్రవారం సాయంత్రం)
సహర్ 5-08 (శనివారం తెల్లవారుజామున)

వాతావరణం
గరిష్టం/కనిష్టం 40.3 /22.1
ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

గద్వాల: జిల్లాలో నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి కల్పించుటకు ఎంఏఎల్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్ ఎం.ప్రియాంక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళా ఈ నెల 22వ తేదీ శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 మధ్య వయస్సు, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి ఉన్న వారు అర్హులని, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, యాక్సిస్ బ్యాంక్, మెడ్‌ప్లస్, ముత్తూట్ ఫైనాన్స్‌తో పాటు హైదరాబాద్, గద్వాలలోని వేర్వేరు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

25న వడ్డేపల్లి సంత వేలం పాటలు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తైబజార్, గొర్రెల సంత వేలం పాటలు ఈ నెల 25న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ రాజయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్, గొర్రెల సంత వేలం వేయనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయం నందు వేలం పాటలు వుంటాయని, ఇందులో పాల్గొన దలచిన వారు ఈనెల 20 నుంచి 24 తేదీ సాయంత్రం 5 గంటలలోగా రూ.5 వేలు చెల్లించి దరఖాస్తు ఫారం పొందాలని సూచించారు. దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, సంతకంతో కూడిన మూడు బ్లాంక్ చెక్కులు, డీడీతోసహా కార్యాలయంలో అందజేయాలని, 24 సాయంత్రం 5 గంటల తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని కమీషనర్ పేర్కొన్నారు.

ఆర్డీఎస్ కెనాల్‌కు నీటి విడుదల



రాజోళి: తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా గురువారం ఆర్డీఎస్ కెనాల్‌కు నీటి విడుదల చేశారు. పంటలు ఎండిపోతున్నాయని గత రెండు రోజుల క్రితం శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను రైతులు కలిసి విన్నవించగా.. ఆయన ఈఎన్‌సీ, పైఅధికారులతో మాట్లాడారు. కాగా.. రైతులు సాగు చేసిన పలు పంటలు చివరి దశలో ఉన్నాయని, ప్రస్తుతం కీలకమైన తడులు అందించకపోతే చేతికి వచ్చిన పంటలు ఎండిపోతాయని అధికారులకు తెలియచేసి తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా నీటి విడుదల చేయాలని అధికారులను కోరడంతో గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో అధికారులు మోటార్ ఆన్ చేసి నీటి విడుదల చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు నీటి విడుదల సమయంలో అక్కడకు చేరుకున్నారు. కార్యక్రమంలో దస్తగిరి, పెద్దింటి నాగేష్, శంకర్ నాయుడు, హసన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

గద్వాలటౌన్: మధ్యప్రదేశ్‌లో జరిగే ఎస్‌జీఎఫ్–14 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వీరేష్, లక్ష్మి ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో ఉమ్మడి జిల్లా జట్టు తరపున బాలురు విభాగంలో వీరేష్, బాలికల విభాగంలో లక్ష్మి పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయి పోటీలలో మన జిల్లా క్రీడాకారుల క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి సెలక్టర్లు జాతీయ స్థాయి పోటీల ఎంపిక చేశారు. ఏప్రిల్ జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో వీరు పాల్గొననున్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను పాఠశాల హెచ్ఎం ఇమ్మానియేల్, ఫిజికల్ డైరెక్టర్ హైమావతి, బీసన్నలు అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

వేరుశనగ క్వింటా రూ.6,682

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 1210 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6682, కనిష్టం రూ.3772, సరాసరి రూ. 5298 ధరలు పలికాయి. అలాగే, 15 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.6439, కనిష్టం రూ.6011, సరాసరి రూ. 6413 ధరలు వచ్చాయి. 34 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 6091, కనిష్టం రూ. 5835, సరాసరి రూ. 6009 ధరలు లభించాయి.



అట్టడుగున నాలుగు జిల్లాలు

జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో వెనుకంజ

- మహబూబ్‌నగర్ జిల్లా కాస్త మెరుగు
- పరిశ్రమల పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కరువు
- సోలార్ మోడల్ విలేజ్‌గా కొండారెడ్డిపల్లి
- తెలంగాణ సోషల్ ఎకనామిక్ అవుట్ లుక్ 2025లో వెల్లడి

సాక్షి, నాగర్‌కర్నూల్: వ్యక్తిగత ఆదాయంగా పరిగణించే తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాల కల్పనలో ఉమ్మడి పాలమూరు జిల్లాలు ఇంకా అట్టడుగునే కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోలిస్తే ఆదాయం, ఉత్పత్తి, ఉపాధిలో వెనకబాటు కనిపిస్తోంది. తెలంగాణ సోషల్ ఎకనామిక్ అవుట్‌లుక్–2025 రిపోర్టులో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అలాగే గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో నూతన పరిశ్రమలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టనుంది. అయితే అనీమియా ముక్త్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తీసుకున్న చర్యల ఫలితంగా వనపర్తి జిల్లా 91.8 శాతం పనితీరుతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది.

➩ వస్తు సేవల ఉత్పత్తిగా లెక్కించే జీఎస్‌డీపీ లెక్కల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలు రాష్ట్రంలోనే వెనుకంజలో ఉన్నాయి. ఈ విషయంలో నారాయణపేట జిల్లా రాష్ట్రంలోనే 30వ స్థానంలో ఉంది. జోగుళాంబ గద్వాల 27, వనపర్తి 26, నాగర్‌కర్నూల్ 19వ స్థానంలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మాత్రం రూ.32,767 కోట్ల జీఎస్‌డీపీతో రాష్ట్రవ్యాప్తంగా పదో స్థానంలో నిలిచింది. వ్యక్తుల ఆదాయంగా పరిగణించే తలసరి ఆదాయంలో మహబూబ్‌నగర్ జిల్లా మినహా మిగతా నాలుగు జిల్లాలు వెనుకబడిపోయాయి. మహబూబ్‌నగర్ రూ.2,93,823 తలసరి ఆదాయంతో రాష్ట్రంలో 6వ స్థానంలో ఉండగా.. నారాయణపేట 30, జోగుళాంబ గద్వాల 26, వనపర్తి 22, నాగర్‌కర్నూల్ 20వ స్థానంలో ఉన్నాయి.

➩ ఉమ్మడి పాలమూరులో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టడం లేదు. నూతన పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులు, ఉపాధి కల్పన విషయంలో ఉమ్మడి జిల్లా వెనుకబడి ఉంది. నారాయణపేట జిల్లాలో 102 పరిశ్రమలు మాత్రమే ఉండగా.. వీటి పరిధిలో 2,045 మంది ఉపాధి పొందుతున్నారు. కాగా మహబూబ్‌నగర్‌లో 462 యూనిట్లతో 32,443 మందికి ఉపాధి పొందుతున్నారు. మిగతా జిల్లాల్లో ఐదు వేల మందికి మించి ఉపాధి లేదు. ఇక అటవీ విస్తీర్ణంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో 35.81 శాతం అటవీ భూమితో రాష్ట్రంలో ఆరో స్థానంలో ఉండగా.. గద్వాల జిల్లాలో కేవలం 2.32 శాతం మాత్రమే అటవీ విస్తీర్ణం ఉంది. డొమెస్టిక్ విద్యుత్ కనెక్షన్లలో 57.4శాతంతో నాగర్‌కర్నూల్ అట్టడుగు స్థానంలో ఉండగా. వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాలు సైతం 65 శాతం లోపే కనెక్షన్లు ఉన్నాయి.


➩ రాష్ట్రంలోనే సోలార్ మోడల్ విలేజ్‌గా నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి నిలిచింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో మొత్తం 1,451 మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో 499 డొమెస్టిక్, 66 కమర్షియల్, 867 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటివరకు 422 గృహ వినియోగదారులకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించారు. పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం పెంచడం, ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపర్చడం, పర్యావరణ హితంలో భాగంగా ప్రభుత్వం ఈ సోలార్ మోడల్ ప్రాజెక్ట్‌ను చేపట్టింది.

ప్లాస్టిక్ ఫ్రీగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్..

నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా కొనసాగుతోంది. వన్యప్రాణులు, అటవీప్రాంత సంరక్షణ కోసం ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 80 శాతం వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించగలిగారు. శ్రీశైలం–హైదరాబాద్ రహదారి వెంబడి ఇప్పటివరకు సేకరించిన మొత్తం 34 వేల కిలోల ప్లాస్టిక్‌ను తుక్కుగూడలో రీసైక్లింగ్ ప్రాసెస్‌ను నిర్వహించారు. అలాగే 16 మంది స్థానిక చెంచు మహిళల ఆధ్వర్యంలో పర్యావరణ హిత బ్యాగ్‌లు, ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.

మహబూబ్‌నగర్ | నాగర్‌కర్నూల్ | వనపర్తి | జోగుళాంబగద్వాల | నారాయణపేట

ఉమ్మడి జిల్లాలో జీఎస్డీపీ ఇలా(రూ.కోట్లలో)




పంటల సాంద్రత ఇలా.. (శాతాల్లో)



భూ యజమానులు (సగటున హెక్టార్లలో)




తలసరి ఆదాయం (రూపాయల్లో)



పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి కల్పన..

జిల్లా	యూనిట్లు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి పొందిన వారు	విద్యుత్ కనెక్షన్లు (శాతాల్లో) గృహాలు	వ్యవసాయం
మహబూబ్‌నగర్	462	16,818	32,443	68.9	18.3
నాగర్‌కర్నూల్	277	1,579	4,627	57.4	32.1
వనపర్తి	178	1,857	4,511	62.7	25.8
జోగుళాంబగద్వాల	133	2,358	2,322	65.5	24.1
నారాయణపేట	102	1,032	2,045	62.0	26.8

అటవీ విస్తీర్ణం..



బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం



పీజీ సెంటర్ వద్ద నిసరన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

గద్వాల: రాష్ట ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కుర్వ పల్లయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీజీ సెంటర్‌లో బడ్జెట్ పత్రాలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ విద్యావ్యవస్థను పాతాళానికి తొక్కేసిందన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.53శాతమే నిధులు కేటాయించడమే ఇందుకు నిదర్శమన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ రూపంలో రూ.8వేల కోట్లు బకాయిలు రావాల్సి ఉందని, ప్రస్తుతం బడ్జెట్‌లో కేవలం రూ.23,108కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. విదేశీ యూనివర్సిటీలలో చదువుతున్న ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ఆర్థిక సాయం సున్నా అన్నారు. విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న సీఎం తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రాజు, సందేష్, మాధవ్, నరేంద్ర, పవన్, జోయెల్, హరికృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.


గద్వాల బార్ అసోసియేషన్‌లో వర్గవిభేదాలు

నూతన కార్యవర్గం ఎంపికలో గందరగోళం

గద్వాల: గద్వాల బార్ అసోసియేషన్‌లో వర్గవిభేదాలు పొడచూపడంతో నూతన కార్యవర్గం ఎన్నిక గందరగోళానికి దారితీసింది. 2024–25 సంవత్సరంలో ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈక్రమంలో 2025–26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునే ప్రక్రియలో భాగంగా ఇరువర్గాల వారు పూజారి శ్రీధర్, జి.రాజశేఖర్‌రెడ్డిని ఎన్నికల అధికారులుగా నియమించుకున్నారు. ఇద్దరు ఎన్నికల అధికారులు నూతన కార్యవర్గం ఎంపికకు సంబంధించి పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. ఈక్రమంలో గురువారం ఓ వర్గానికి చెందిన ఎన్నికల అధికారి పూజారి శ్రీధర్ నూతన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గం బార్ రూంలో సమావేశమై సంబరాలు జరుపుకొన్నారు. ఇదిలా ఉంటే మరోవర్గం నాయకులు రఘురాంరెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైనట్లు ప్రకటించినవారు ఎలాంటి నియమనిబంధనలు పాటించలేదని, వారి ఎన్నికకు ఎలాంటి చట్టబద్ధత లేదని చెప్పారు. దీనిపై తాము అన్ని ఆధారాలు, వివరాలతో సహా స్టేట్ బార్ అసోసియేషన్‌కు పంపినట్లు తెలిపారు. తాము బైలాస్‌ను పాటిస్తూ కొత్త కార్యవర్గ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు నామినేషన్లకు చివరి తేదీ, 21వ తేదీన స్క్రూటినీ, 22వ తేదీన విత్‌డ్రా, 27వ తేదీన నూతన కార్యవర్గం ఎంపిక ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన బాడీకి నిబంధనల ప్రకారం ఏప్రిల్ 1వ తేదీన బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

ముగిసిన ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు

117 మంది విద్యార్థులు గైర్హాజరు



పరీక్ష అనంతరం విజయధరహాసంతో విద్యార్థులు

గద్వాలటౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మార్చి 5 నుంచి ప్రారంభమైన పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు కెమిస్ట్రీ–2, కామర్స్–2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 3,577మంది విద్యార్థులకుగాను 3,458 మంది హాజరయ్యారు. పలువురు రెగ్యులర్ విద్యార్థులతో పాటు ప్రైవేటు విద్యార్థులు మొత్తం కలిపి 117 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను ఇంటర్ విద్య జిల్లా అధికారి హృదయరాజు, మండల కేంద్రాలలోని కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పరీక్షలు ముగిసిన వెంటనే స్నేహితులు ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. సంతోషంగా ఇంటిబాట పట్టారు.

రేపు మున్సిపల్ ప్రత్యేక అధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్



గద్వాల: జిల్లాలో పుర పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో నాలుగు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) నర్సింగ్‌రావుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేసుకునేందుకు శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది.



నర్సింగ్‌రావు, మున్సిపల్ ప్రత్యేక అధికారి

ఫోన్ చేయాల్సిన నంబర్లు : 9849907791, 7013959652

సమయం : శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు..

విద్యార్థీ... విజయీభవ!

నేటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు

- హాజరుకానున్న 7,717మంది విద్యార్థులు
- మొత్తం 40 పరీక్ష కేంద్రాలు.. 430 మంది ఇన్విజిలేటర్లు
- జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు



జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న విద్యాధికారులు

గద్వాలటౌన్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షలకు మొత్తం 7,717 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 117 మంది ఉన్నారు. పది పరీక్ష రాసే వారిలో మొత్తం 3,851 మంది విద్యార్థులు బాలురు కాగా, 3,866 మంది బాలికలున్నారు. పరీక్షలను జంబ్లింగ్ పద్ధతిలోనే నిర్వహించనున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు అవసరమైన బస్సులను ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ ఉన్నాతధికారులు ప్రకటించారు. ఇందుకోసం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. విద్యార్థులు తమ వద్ద ఉన్న పాత బస్‌పాస్, లేదా పదో తరగతి హాల్ టికెట్ చూపించి బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రానికి చేరుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం ఆర్టీసీ ఇప్పటికే రూట్ మ్యాపింగ్ ప్రణాళికను తయారు చేసింది.

సీసీ కెమెరాల నిఘాలో..

ప్రతి పరీక్ష కేంద్రంలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలోనే ప్రశ్నపత్రాల కవర్లను తెరవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆయా పరీక్ష కేంద్రాలలో ఉన్న సీసీ కెమెరాల పనితీరును అధికారులు పరిశీలించారు. పోలీసు స్టేషన్లకు దూరంగా ఉన్న 'సీ' సెంటర్ల నుంచి ప్రశ్న పత్రాలను తరలించేందుకు పోలీసు ఎస్కార్టుతో ప్రత్యేక వాహనాలను కేటాయించారు. విద్యార్థులు, సిబ్బంది పరీక్ష కేంద్రం లోపలికి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు అనుమతించరు.

పటిష్ట బందోబస్తు

కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులతో పది పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పటిష్ట బందోబస్తు మధ్య ప్రశ్న పత్రాలను తరలించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 163 సెక్షన్ అమల్లో ఉంటుంది. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేస్తారు. పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించి ఉండాలి.

ప్రశాంతంగా రాయండి

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తాం. పరీక్ష సమయానికి గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

– బీఎం సంతోష్, కలెక్టర్

జిల్లా వివరాలిలా..

మొత్తం పరీక్ష కేంద్రాలు	విద్యార్థుల సంఖ్య	ఇన్విజిలేటర్లు	ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు
40	7,717	430	3

చీఫ్ సూపరింటెండెంట్లు	డిపార్టుమెంట్ అధికారులు	సెంటర్ కస్టోడియన్లు	రూట్ ఆఫీసర్స్	'సీ' సెంటర్స్
40	40	14	3	9

పరీక్ష సమయం : ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు

ఇసుక కొరత అధిగమించేందుకు చర్యలు



టీఎస్ఎండీసీ ద్వారా గతంలో తీసిన ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, జిల్లా మైనింగ్ అధికారులు

గద్వాల/రాజోళి/శాంతినగర్/అయిజ: ఇసుక అందుబాటులో ఉంచి, జిల్లాలో ఇసుక కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం జిల్లా మైనింగ్ ఏడీ వెంకటరమణతో కలిసి తుమ్మిళ్లలో కలెక్టర్ పర్యటించారు. తుంగభద్ర నదీ తీరంలో గల ఇసుక డీ–సిల్టేషన్ ప్రాంతాన్ని గుర్తించి పరిశీలించారు. గతంలో టీఎస్ ఎండీసీ ఆధ్వర్యంలో ఇక్కడి నుండే ఇసుక సరఫరా చేయగా, ప్రస్తుతం వారి కాంట్రాక్ట్ ముగియడం, దాని రెన్యూవల్ ప్రక్రియ నడుస్తుండటంతో మళ్లీ ఇసుక సౌలభ్యం కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. అక్కడ ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించి వాటి సరఫరా వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు. క్షేత్ర స్థాయిలో భౌగోళిక పరిస్థితులను పరిశీలించి ఇబ్బందులు తలెత్తకుండా టీఎస్ ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక డీ–సిల్టేషన్ ను ప్రారంభించాలన్నారు. అంతకుముందు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ ఈఈ శ్రీనివాస్,తహసీల్దార్ రామ్మోహన్,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారాన్ని అందించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఓటరు నమోదు, బూత్‌లెవెల్ ఏజెంట్ల నియామకాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతిఒక్కరికి ఓటుహక్కు కల్పించేందుకు నిర్ణయించిందన్నారు. అదేవిధంగా పోలింగ్‌బూతులలో ఏజెంట్ల నియామకానికి సహకరించాలన్నారు. ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు ఏదైనా అభ్యంతరాలుంటే ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. నూతన ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన వారి వివరాలను ఫామ్ 6,7,8 ద్వారా అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాస్ రావు, తహసీల్దార్ మల్లిఖార్జున్, డీటీ కరుణాకర్, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు లేఅవుట్లు ఉండాలి

ప్రభుత్వ నిబంధనల మేరకు లేఅవుట్లు వుండాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని సర్వే నంబర్లు 190, 289, 298లో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లను కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ లైన్లు, మ్యాన్‌హోల్స్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, అయిజలోని 751, 957 సర్వే నెంబర్లలో ఏర్పాటు చేసిన లేఅవుట్లను పరిశీలించారు.

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి



నారాయణపేట రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతిచెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పేరపళ్ల సమీపంలో ఉన్న డ్రైవర్ గోపితండాకు చెందిన శారు రాథోడ్ (20)ను సమీపంలోని రెడ్యానాయక్‌తండాకు చెందిన బంధువు వినోద్‌నాయక్ ఇచ్చి రెండునెలల క్రితం వివాహం జరిపించారు. పెళ్లి అయిన నాటి నుంచి తనకు ఆ అమ్మాయి వద్దంటూ రాథోడ్ తరచూ గొడవపడుతూ ఉండేవాడు. గురువారం ఉదయం ఫోన్ రావడంతో వివాహిత తండ్రి లోక్యానాయక్ కూతురి ఇంటికి వెళ్లి చూడగా మృతిచెంది కనిపించింది. ఆమె గొంతుపై గాయాలు ఉండటంతో హత్య చేశారని భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

చెన్నంపల్లిలో వ్యక్తి..

లింగాల: మండలంలోని చెన్నంపల్లికి చెందిన ఓర్సు లింగస్వామి (35) గురువారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు గ్రామస్తులు, పోలీసులు తెలిపారు. ఇంటిలో ఒంటరిగా నిద్రించిన వ్యక్తి తెల్లవారేసరికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడం.. పాదాలు రక్తంతో ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భార్య సైదమ్మ 6 నెలల కిందట ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకోగా.. ఉన్న ఇద్దరు కుమారులు ప్రస్తుతం మేనమామ దగ్గర ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటన స్థలాన్ని అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్ఐ నాగరాజు, డాగ్‌స్క్వాడ్ బృందం క్షుణంగా పరిశీలించాయి. అన్న ఓర్సు బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

చెట్టుపై నుంచి కిందపడి..

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌కు చెందిన సత్యం యాదవ్ (30) చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సత్యం ఈ నెల 15న గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఆకు తెంచడానికి పైకెక్కి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే మహబూబ్‌నగర్‌కు, అటు నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి దాటాక మృతిచెందినట్లు గ్రామస్తులు వివరించారు. గురువారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. సత్యంకు భార్య భాగ్యమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో చికిత్స పొందుతూ..

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. బిజినేపల్లి మండలం సల్కర్‌పేటకు చెందిన శ్రీనివాసులు (55) ఈ నెల 17న ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా జిల్లాకేంద్రంలో వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

జడ్చర్లలో యూపీ వాసి..

జడ్చర్ల: స్థానిక హౌసింగ్‌బోర్డుకాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈ నెల 16న మైలు విశ్వకర్మ(20), మిత్రుడు నిఖిల్ జైస్వాల్ (19) కలిసి స్కూటీపై మెడికల్ షాప్‌కు వెళ్లారు. మందులు కొనుగోలు చేసి తిరిగి విజయనగర్ కాలనీలోని ఇంటికి వస్తుండగా ప్రధాన రహదారిపై మహబూబ్‌నగర్ వైపు నుంచి వచ్చిన నాలుగు చక్రాల ఆటో వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత నిఖిల్ జైస్వాల్ సొంత ప్రాంతం ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. గురువారం ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లల మృతి

అయిజ : వీధి కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని విఠలాపురం గ్రామ శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. తూముకుంట గ్రామానికి చెందిన కుర్వ దొడ్డ గోపాల్ గొర్రె పిల్లలకు రక్షణగా ఇనుప కంచె ఏర్పాటుచేసి గొర్రెల మేపడానికి వెళ్లాడు. రాత్రి గొర్రె పిల్లలకు పాలు తాగిద్దామని కంచె వద్దకు రాగా అందులోని 40 గొర్రె పిల్లలు మృతి చెంది వున్నాయి. దీంతో గోపాల్ కన్నీటిపర్యంతమయ్యాడు. వీధి కుక్కలు వలలో దూరి గొర్రె పిల్లలను కొరికేశాయని, రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

సహాయక చర్యలు వేగవంతం

- డీ–1, 2 ప్రదేశాల్లో బండరాళ్ల తొలగింపు
- భారీ పంపులతో డీవాటరింగ్‌కు చర్యలు
- ఒక్కొక్కటిగా సవాళ్లను అధిగమిస్తూ ముందుకు..
- 27 రోజులుగా శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు
- ఎస్ఎల్‌బీసీలో అందుబాటులోకి రాని రోబో సేవలు



సొరంగంలోని టీబీఎం శకలాలు తొలగిస్తున్న సహాయక సిబ్బంది

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో సహాయక చర్యలు చేపట్టడం రోజురోజుకూ సవాల్‌గా మారుతోంది. సొరంగం పైకప్పు కూలిన ఘటన జరిగి 27 రోజులైనా నేటికీ కార్మికుల జాడ లభించలేదు. సొరంగం ప్రమాదంలో దెబ్బతిన్న టీబీఎం మిషన్ భాగాలను తొలగిస్తూ ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సహాయక సిబ్బందికి పనుల్లో జాప్యం జరుగుతోంది. అయితే గురువారం డీ–1, డీ–2 ప్రదేశాల్లో ఉన్న పెద్దపెద్ద బండరాళ్లను సైతం తొలగించి బయటికి పంపిస్తున్నారు. వీటిని కదిలిస్తుండటంతో నీటి ఊట కూడా భారీగా పెరిగింది. అందుకు అనుగుణంగా భారీ పంపుల ద్వారా నీటిని బయటికి పంపిస్తున్నారు. డీవాటరింగ్ ప్రక్రియతోపాటు బురద, మట్టిని తొలగిస్తూ లోకో ట్రైన్ ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లేందుకు మార్గం సుగమం చేస్తున్నారు. దీంతో గతంలో కంటే సహాయక చర్యలు మరింత వేగవంతం అయ్యాయి. సహాయక చర్యల్లో పాల్గొంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల సహాయక బృందాలను తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్ మిశ్రా అభినందించారు.

ఐదు షిఫ్టుల్లో..

సహాయక చర్యలు ప్రతిరోజు 5 షిఫ్టులుగా కొనసాగుతున్నాయి. ఉదయం 7 గంటలకు, 11, మధ్యాహ్నం 3, రాత్రి 7, 11 గంటల షిఫ్టుల్లో ప్రత్యేక సహాయక బృందాలు నిరంతరాయంగా శ్రమిస్తున్నాయి. సొరంగంలో లోపల జరిగే సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 27 రోజులుగా సొరంగంలో రాత్రి, పగలు పనిచేస్తూ.. ప్రమాద స్థలంలో పేరుకుపోయిన టీబీఎం భాగాలు స్టీల్, బండరాళ్లు, బురదను తొలగిస్తూ సహాయక చర్యలు చేపడుతున్నారు. సొరంగంలో ప్రమాద స్థలానికి చేరువలో సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. అయితే సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు తెప్పించిన రోబో సేవలు పదిరోజులైనా అందుబాటులోకి రాలేదు. టీబీఎం శకలాలు పూర్తిగా తొలగిస్తే తప్ప రోబో సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు.

సమన్వయంతో ముందుకు..

ఎస్ఎల్‌బీసీ సొరంగం లోపల సహాయక చర్యలపై చేపట్టాల్సిన భద్రత ప్రమాణాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నామని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి హరీష్, సింగరేణి రెస్క్యూ జీఎం బైద్య సొరంగం లోపలి పరిస్థితులను ఆయనకు వివరించారు. సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు అన్ని బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. ఉబికి వస్తున్న నీటి ఊటను ఎప్పటికప్పుడు అధిక సామర్థ్యం కలిగిన పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.



సొరంగంలో నుంచి బయటికి తెచ్చిన బండరాళ్లు

పరీక్షల వేళ.. ఆహారంపై శ్రద్ధ

- నూనె వస్తువులు, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి
- రాత్రివేళ అతిగా భోజనం ప్రమాదం
- ప్రతిరోజూ నిర్ణీత సమయంలోనే నిద్ర మంచిది
- కాలానుగుణ పండ్లతో ఏకాగ్రత పెంపు
- 'సాక్షి'తో జనరల్ ఆస్పత్రి న్యూట్రిషనిస్ట్ శైలజ



పాలమూరు: జిల్లాలో శుక్రవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే పరీక్షల ముందు కొంత మంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవడం, త్వరగా అలిసిపోవడం వంటివి జరుగుతుంటాయి. ముందుగా మానసిక ఒత్తిడి నుంచి బయటపడాలని, ఆ సమయంలో ఆరోగ్యంగా ఉండేలా ఆహారంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని జనరల్ ఆస్పత్రి న్యూట్రిషనిస్ట్ శైలజ చెబుతున్నారు. వివరాలు ఆమె మాటల్లోనే..

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అంటే..

విద్యార్థులు వేళకు భోజనం చేయాలి. ఉదయం త్వరగా జీర్ణమయ్యే అల్పాహారం, మధ్యాహ్నం సంప్రదాయ భోజనం మితంగా మాత్రమే తీసుకోవాలి. మాంసాహారం, నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాల జోలికి వెళ్లొద్దు. రాత్రి సైతం ఇదే విధంగా నిద్రపోవడానికి కనీసం రెండు గంటల ముందు భోజనం చేయాలి. ఉదయం సకాలంలో నిద్రలేస్తే రోజు మొత్తం చురుకుగా ఉంటారు.

పరీక్ష రోజు ఎలా?

ఉదయం అల్పాహారంలో ఇడ్లీ, దోసె, ఉప్మా, పాలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. మధ్యాహ్నం అన్నం, రొట్టె, కూరగాయాలు, ఆకుకూరలు, పెరుగు, సాంబార్ వంటివి తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది. రాత్రి అన్నం లేదా చపాతి పప్పు వంటివి తక్కువ మోతాదులో తీసుకోవాలి.

ఆహారానికి, నిద్రకు సంబంధం

సాధారణంగా రాత్రివేళలో అతిగా భోజనం చేస్తే నిద్రపట్టదు. ఈ సమయంలో వేపుళ్లు, చిప్స్, తీపి పదార్థాలు, చాక్లెట్లు తినకూడదు. కాఫీ, టీ, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. వీటి వల్ల నిద్రలేమికి గురయ్యే ప్రమాదం ఉంది. తిన్న వెంటనే పుస్తకం పట్టుకుంటే నిద్ర ముంచుకొచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనీసం 10 నుంచి 15 నిమిషాల పాటు వాక్ చేయడం మంచిది. ప్రతిరోజు ఒకే నిర్ణీత సమయంలోనే నిద్రపోవాలి. కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోతే పడుకునే ముందు తీసుకున్న ఆహారం సైతం సక్రమంగా జీర్ణమై ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ఉంటారు.

భోజనంలో వేటికి ప్రాధాన్యం

సమతుల ఆహారానికి ప్రాధాన్యమివ్వాలి. భోజనంలో పోషకాలు, కార్బోహైడ్రేట్లు ఉండేలా చూసుకోవాలి. ఇందుకు పప్పుధాన్యాలు, చపాతి, అన్నం, కూరగాయలు వంటివి తీసుకోవాలి. తక్కువ మోతాదు ఉన్న నూనె పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. కాలానుగుణ పండ్లు తీసుకుంటే ఏకాగ్రత పెరుగుతుంది. అతిగా భోజనం చేస్తే ఆరోగ్యం సమస్యతో పరీక్షలపై ప్రభావం చూపుతుంది. నీళ్లు ఎక్కువగా తాగాలి. అల్పాహారంలోనూ తేలికపాటి ఆహారం ఉంటే మంచిది. రోజూ ఉదయం డ్రైఫ్రూట్స్ తీసుకుంటే అలసట నుంచి ఉపశమనం పొందవచ్చు.



వివరాలు వెల్లడిస్తున్న నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

కి'లేడీ'లు

- ఇంటి అద్దె కోసమని వచ్చి చోరీ
- సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు ఛేదించిన పోలీసులు
- అభినందించిన నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

అచ్చంపేట రూరల్: తమకు ఇళ్లు అద్దెకు కావాలని వచ్చిన ఇద్దరు మహిళలు చోరీ చేశారు. బుర్ఖాలు వేసుకొని దర్జాగా చోరీకి పాల్పడిన ఇద్దరు కి'లేడీల'ను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులుతో కలిసి ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన అశ్విని టైలరింగ్ చేస్తోంది. పెంట్లవెల్లికి చెందిన చాపల శ్రావణితో కలిసి వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు యొక్క స్థితిగతులపై రెక్కీ నిర్వహించారు. ఇద్దరు కలిసి ఆన్‌లైన్‌లో బుర్ఖాలు కొనుగోలు చేసి వాటిని ధరించారు. ఎవరికీ అనుమానం రాకుండా గతనెల 16న సాయంత్రం ఉపాధ్యాయురాలు ఇంటికి వెళ్లారు. మాటామాట కలిపారు. ఇళ్లు అద్దెకు కావాలని, నెలకు ఎంత ఇవ్వాలని ముచ్చటించారు. పథకం ప్రకారం ఆమెను బెదిరించి ఆమె దగ్గర ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలు, 4.5 తులాల వెండి వస్తువులు దొంగిలించి అక్కడి నుండి ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అచ్చంపేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా సీఐ రవీందర్, ఎస్ఐలు రమేష్, ఇందిర తమ సిబ్బంది సహాయంతో చాకచక్యంగా కేసును చేధించి నిందితురాళ్లను పట్టుకున్నారు. త్వరగా కేసును చేధించిన అచ్చంపేట పోలీసులను ఎస్పీ అభినందించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఎంతో కష్టపడి ఈ నెలలో 30 కేసుల వరకు ఛేదించినట్లు ఎస్పీ తెలిపారు.

దేవరకద్ర సంత ఆదాయం రూ.69.38 లక్షలు



పశువుల సంత వేలం నిర్వహణ

దేవరకద్ర: స్థానిక పురపాలికకు సంతల వేలం ద్వారా రూ.69. 38 లక్షల ఆదాయం సమకూరింది. గురువారం పుర కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించగా మహబూబ్‌నగర్, దేవరకద్ర పుర కమిషనర్లు మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మేనేజర్ సీత్యానాయక్ పాల్గొన్నారు. వేలంలో పశువుల సంతను రూ.47.96 లక్షలకు పట్టణానికి చెందిన ఆది హన్మంత్‌రెడ్డి దక్కించుకున్నారు. అలాగే గొర్రెలు, మేకల సంతను రూ.15.36 లక్షలకు కుర్వ రాంపాండు, తైబజార్‌ను రూ.6.06 లక్షలకు కుర్వ బీరప్ప దక్కించుకున్నారు. పురపాలిక నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువగా రావడంతో వాయిదా లేకుండా కాంటాక్టులను ఖరారు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026, మార్చి 31 వరకు కాంటాక్టు అమలులో ఉంటుందని అధికారులు వివరించారు.

8నెలల తర్వాత తేలిన సంగమేశ్వరాలయం



కృష్ణానదిలో నీటి నుంచి బయటపడిన సంగమేశ్వరాలయం

- గర్భగుడిలోని శివలింగానికి పూజలు
- ఆలయ పరిసరాలు శుభ్రం చేసేందుకు చర్యలు



గర్భగుడిలో శివలింగం

కొల్లాపూర్: కృష్ణానదిలో ఎనిమిది నెలలు మునిగి ఉన్న సంగమేశ్వరాలయం పూర్తిగా తేలింది. గురువారం తెల్లవారుజాము వరకే ఆలయ ప్రాంగణం మొత్తం పూర్తిగా నది నీటి నుంచి బయటపడింది. దీంతో గర్భగుడిలో నీటిని బయటకు ఎత్తిపోశారు. నది నీరు తొలగిపోవడంతో ఆలయంలోని వేపదారు శివలింగం భక్తులకు దర్శనమిచ్చింది. శివలింగానికి ఆలయ అర్చకులు రఘురామశర్మ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. నీటిలో మునిగి ఉండటం కారణంగా ఆలయ ప్రాంగణం మొత్తం బురదమయంగా మారడంతో పరిసరాలు శుభ్రం చేసేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు అర్చకులు వెల్లడించారు. గతేడాది జూలై 17న సంగమేశ్వరాలయం కృష్ణానదిలో మునిగింది.

పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



నాగర్‌కర్నూల్‌లోని పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుంటున్న వ్యక్తిని అడ్డుకుంటున్న ఎస్ఐ

నాగర్‌కర్నూల్ క్రైం: న్యాయం చేయాలంటూ ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. బల్మూరు మండలం గోదల్‌కి చెందిన 14మంది రైతులకు సంబంధించిన వరి ధాన్యాన్ని నాలుగు నెలల క్రితం జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసులుకు గోదల్ గ్రామానికి చెందిన రవి మధ్యవర్తిగా ఉండి విక్రయించాడు. వ్యాపారి శ్రీనివాసులు రైతులకు డబ్బులు చెల్లించకపోవడంతో గురువారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అతడి ఇంటి ముందు వంటావార్పు నిర్వహిస్తుండటంతో డయల్ 100కు సమాచారం రావడంతో రైతులను పోలిస్‌స్టేషన్‌కు పిలిచారు. ఈక్రమంలోనే మధ్యవర్తి రవి పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం చేయాలంటూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడటంతో ఎస్సై గోవర్ధన్ అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌లోకి తీసుకువెళ్లాడు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా బాధితులకు పోలీస్ శాఖ ద్వారా న్యాయం చేస్తామని సముదాయించి పంపించి వేసినట్లు తెలిపారు.

దొంగ రిమాండ్‌లో పోలీసుల గోప్యత

కల్వకుర్తి టౌన్: వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను బుధవారం రిమాండ్ చేసిన పోలీసులు ఆ విషయంలో గోప్యత పాటించారు. వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లును అడగగా నిజమేనని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కల్వకుర్తిలో బుధవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తుండగా పాలమూరు చౌరస్తాలో పోలీసులను చూసి ద్విచక్రవాహనదారుడు పారిపోగా పోలీసులు అనుమానం వచ్చి వెంబడించి పట్టుకున్నారు. ఇతను పాత నేరస్తుడు భాషమోని సైదులుగా గుర్తించి విచారించారు. అతను పలు నేరాలు చేసినట్లు ఒప్పుకోవడంతో అతని నుంచి 16 తులాల బంగారం, 84 తులాల వెండి, ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై పలు స్టేషన్లలో ఇప్పటి వరకు 50కిపైగా కేసులు ఉన్నాయని, కల్వకుర్తి కోర్టులో అతనిని హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించారని డీఎస్పీ చెప్పారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నాగార్జున, ఎస్ఐలు మాధవరెడ్డి, కృష్ణదేవ, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు నజీర్, చిరంజీవిని అభినందించి.. రివార్డులు సైతం అందిస్తున్నట్లు తెలిపారు.

గోప్యతపై అనుమానం..?

వరుస నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడు భాషమెని సైదులు రిమాండ్ విషయంలో పోలీసులు గోప్యత పాటించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర నేరాలలో దొంగలు దొరకక అతనినే రిమాండ్ చేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. చోరీలు జరుగుతున్నా నిజమైన దొంగలను పట్టుకోలేక, వారికి ఉన్న ఒత్తిడి దృష్ట్యా పాత నేరస్తుడినే పట్టుకొని నామమాత్రంగా చోరీ అయిన సొత్తును చూయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు విడుదల చేసిన ప్రెస్‌మీట్ ఫొటోలో ఓ ఎస్ఐను అతికించినట్లు ఉండటంతో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ.. పలు రకాలుగా చర్చలు జరుగుతున్నాయి.



ప్రెస్‌మీట్ పెట్టినట్టుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఫొటో

నేటినుంచి లైలతుల్ ఖద్ర్ జాగరణలు

- చివరి దశకంలోకి చేరిన రంజాన్
- లోక కల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు



విద్యుత్ దీపాల వెలుగులో జిల్లా కేంద్రంలోని జామీయ మజీద్

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసం లైలతుల్ ఖద్ర్ ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. రంజాన్ నెల చివరి దశకం కూడా మొదలు కావడంతో ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ రాత్రులను జరుపుకుంటారు. షబే ఖద్ర్ జాగరణలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. చాంద్రమానం ప్రకారం ఇస్లామియా సంవత్సరం తిథులను రాత్రి పూట నుంచి లెక్కించడం పరిపాటి. అందువల్ల నేటి నుంచి ప్రారంభమయ్యే రంజాన్ మాసపు 21, 23, 25, 27, 29 తేదీల్లోని రాత్రులను షబేఖద్ర్‌గా పాటిస్తూ ముస్లింలు ఈ రాత్రుల్లో తెల్లవారేదాకా జాగరణ చేసి అల్లాను ఆరాధిస్తారు.' షబే ఖద్ర్ అంటే అతి విలువైనది, గౌరవమైనదని' అర్థం. వె సాధారణ రాత్రుల కంటే ప్రధానమైందని ఖురాన్‌లో ప్రవచించినందున ముస్లింలు ఈ రాత్రుల్లో జాగరణ చేసి క్షమాబిక్షను కోరుతూ ఇంటిల్లిపాదీ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ పది రోజుల్లో 'ఏతెకాఫ్' అనే సంకల్పాన్ని పాటిస్తారు. ప్రతి మసీదులో ఆ ప్రాంతానికి చెందిన ముస్లిం ప్రముఖులు ఒక్కరైనా ఎతెకాఫ్‌ను విధిగా చేపట్టాలన్న నిబంధన ఉంది. పగలు, రాత్రి స్థానిక మసీదుల్లోనే ఉండి ఇతర ప్రాపంచిక ఆలోచనలు రాకుండా ఖురాన్‌ను పటిస్తూ, తరావీ, తహజ్జుద్ నమాజులు చేస్తూ లోక కల్యాణం కోసం దైవారాధన చేస్తారు. ఖబేఖద్ర్ వేడుకలకు మసీద్‌లు ముస్తాబయ్యాయి.

హాఫిజ్‌సాబ్‌లకు ఘన సన్మానం

పవిత్ర రంజాన్ మాసంలోనే ఖురాన్ గ్రంథం అవతరించింది. మసీదుల్లో హాఫిజ్ సాబ్‌లను నియమించుకొని వారితో నెల రోజులపాటు ప్రతి రోజు 20 రకాతుల ప్రత్యేక తరావీ నమాజ్‌లను చేయిస్తారు. పూర్తి ఖురాన్ గ్రంథం వినిపించిన హాఫిజ్‌లను ఘనంగా సన్మానిస్తారు. వీరికి హదియా (గౌరవవేతనం) అందిస్తారు. అదే విధంగా కొన్నిచోట్ల మూడు రోజులు, ఆరు రోజుల్లో కూడా పూర్తి ఖురాన్‌ను పఠించారు.

నిష్టతో ప్రార్థనలు చేయాలి



రంజాన్ ఎంతో పవిత్రమైన మాసం. ఈ మాసంలో షబేఖద్ర్ జాగరణలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఈ ఐదు రాతుల్లో నిష్టతో ప్రార్థనలు చేయాలి, ఎతికేకాఫ్ పాటించాలి. దేవుని సన్నిధిలో ఉండి ప్రత్యేక నమాజులు చేసి దువా చేయాలి.

–మౌలానా మొహిసిన్‌పాష ఖాద్రీ, మహబూబ్‌నగర్

పిచ్చుకల సంతతిని పెంచుదాం



పిచ్చుకల కోసం గింజలు పెట్టడం ప్రారంభించిన ప్రిన్సిపాల్ సుకన్య

జడ్చర్ల టౌన్: పర్యావరణ సమతుల్యతో ప్రతిజీవి తనవంతు పాత్ర పోషిస్తుందని, ఊర పిచ్చుక తనవంతు పాత్ర పోషిస్తున్నందున వాటి సంతతి పెంపునకు కృషిచేద్దామని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య పిలుపునిచ్చారు. గురువారం కళాశాల బొటానికల్ గార్డెన్‌లో పిచ్చుకల కోసం డా.సదాశివయ్య ఆధ్వర్యంలో తైదలు, కొర్రలు, సామలు, ఊదలు, జొన్నలులాంటి గింజలు, నీళ్లను ప్రత్యేక పాత్రల్లో ఏర్పాటుచేయగా వాటిని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఊరపిచ్చుకల సంఖ్య తగ్గటంతో పర్యావరణ సమతుల్యతకు ముప్పుగా మారుతుందన్నారు. ప్రతి ఏటా మార్చి 20న పిచ్చుకల దినోత్సవం నిర్వహించి వాటి పరిరక్షణకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రవీందర్, భరత్, అభిలాష్ పాల్గొన్నారు.

యువర్స్

● ఆర్ట్ అండ్ కల్చర్



రోహిట్

చిన్నప్పటి నుంచి టీవీల్లో డ్యాన్స్ షోలు చూస్తూ డాన్సర్ కావాలనుకునేవాడు రోహిత్ సరాఫ్. వెండితెరపై కుమారుడిని చూడాలని కలలు కనేవాడు అతడి తండ్రి. అయితే తన కల నెరవేరే భాగ్యాన్ని చూడలేదు. రోహిత్ పన్నెండేళ్ల ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు.

'నాన్న ఆత్మకు శాంతి చేకూరాలంటే నేను నటుడిని కావాల్సిందే' అని బలంగా డిసైడైపోయాడు రోహిత్.

ఢిల్లీ నుంచి ముంబైకి వచ్చిన సరాఫ్ ఒక టీవీ చానల్ యూత్ షోకు హాజరయ్యాడు. కెమెరా ముందుకు రావడం కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా అనిపించింది.

'బాగా కష్టపడితేగానీ ఇక్కడ నెగ్గుకు రాలేం' అనుకున్నాడు. మొదటి సంవత్సరం రెండు టీవీ షోలలో నటించే అవకాశం వచ్చింది. ఆ తరువాత యాడ్స్‌లో, ఒక సినిమాలో అవకాశం వచ్చింది.

అయితే...తొలి సినిమా షూట్ చేసిన రెండున్నరేళ్ల తరువాత అది ఆగిపోయిందని తెలుసుకున్నాడు. బాగా నిరాశకు గురయ్యాడు. ఆడిషన్స్‌కు కూడా వెళ్లేవాడు కాదు. దీంతో ఎవరి నుంచి పిలుపు వచ్చేది కాదు.

మరోవైపు ఆర్థిక ఇబ్బందులు. ఆ చీకటి రోజులలో 'ఇలా అయితే ఎలా?' అని తనకు తానే ప్రశ్న వేసుకున్నాడు. మళ్లీ కష్టపడాలని గట్టిగా అనుకున్నాడు. 'ప్రతిరోజూ కొండంత ధైర్యంతో, కోటి కలలతో నిద్ర లేవాలి అనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

డియర్ జిందగీ, హిచ్కీ, ది స్కై ఈజ్ పింక్‌లాంటి చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. 'యస్...నాకు భవిష్యత్తు ఉంది' అనే ఆశాకిరణం ఉజ్వలంగా మెరిసింది. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'మిస్‌మ్యాచ్‌డ్' తన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అయింది. ప్రస్తుతం మణిరత్నం-కమల్‌హాసన్ సినిమాలో, ధర్మ ప్రొడక్షన్‌లాంటి పెద్ద సంస్థ సినిమాలో నటిస్తున్నాడు. 'కలలు అనేవి పిరికి వాళ్ల కోసం కాదు. ధైర్యంగా ఉండే వ్యక్తుల కోసమే' అంటున్న 28 సంవత్సరాల రోహిత్ సరాఫ్ ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో చోటు సాధించాడు.

ఏకాగ్రత పెరుగుతుంది

చదువు అనేది మహా సముద్రం లాంటిది. మనం నేర్చుకోవడానికి ఎన్నో ఉన్నాయి. మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలి' క్లాసురూమ్‌లో విన్న ఇలాంటి మాటలు ఎప్పటికప్పుడు కొత్త కోర్సులు నేర్చుకునేలా చేసింది. కొత్త కోర్సులు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఐఏఎస్ చేయాలనేది నా లక్ష్యం.

- బి. ప్రవల్లిక



175 ఆన్‌లైన్ కోర్సులు
నాన్‌స్టాప్ లెర్నర్

పది విషయాలు నేర్చుకున్నప్పుడు కూడా... నేర్చుకోవడానికి మరో పది విషయాలు రెడీగా ఉంటాయి. 'నేర్చుకోవడానికి నేను రెడీ' అనుకుంటే మీరే విజేత. అలాంటి ఒక విజేత... బి. ప్రవల్లిక. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 175 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేసి 'ఔరా' అనిపించింది...

విశాఖ జిల్లా భీమిలిలోని 'కస్తూర్బా గాంధీ విద్యాలయం'లో పదవ తరగతి చదువుతున్న బి. ప్రవల్లిక చదువులో ముందుండడమే కాకుండా పలు కోర్సులలో విశేష ప్రతిభ చూపుతూ ప్రశంసలు అందుకుంటోంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన ప్రవల్లిక తండ్రి కోవిడ్ వల్ల చనిపోయారు. తల్లి ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది.



ఆన్‌లైన్ కోర్సుల హవా...

గతంలో సమగ్ర శిక్ష అభియాన్‌ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా పని చేసిన బి.శ్రీనివాసరావు ఇక్కడి విద్యార్థినులు ఆధునిక కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇన్ఫోసిస్ వారి సహకారాన్ని తీసుకున్నారు. కోర్సుల కోసం 20 మందిని ఎంపిక చేశారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా కోర్సులను ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. ఎంపిక చేసుకున్న కోర్సులకు సంబంధించిన సమాచారం, సూచనలు అందిస్తారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షల్లో పాల్గొనాలి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డేటాబేస్, డ్రోన్... మొదలైన వాటితోపాటు మొత్తం 175 కోర్సులు పూర్తి చేసింది ప్రవల్లిక. కోర్సును బట్టి కొన్ని గంటలు లేదా ఒకటి, రెండు రోజుల్లో నేర్చుకుని పరీక్షల్లో పాల్గొంటూ మంచి మార్కులు పొందుతూ సర్టిఫికెట్లు సాధించింది.

నాడు... నేడు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన 'నాడు-నేడు' పనుల ద్వారా ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల ఆన్‌లైన్ కోర్సుల అభ్యసనకు వీలు కలిగింది. రూ. 51 లక్షలతో అదనపు గదులు, విద్యార్థినులు ప్రశాంతంగా చదువుకోవడానికి పెద్ద షెడ్డు, అవసరమైన ఇతర సదుపాయాల కల్పన జరిగింది.

'ఆసక్తి ఉన్నచోటే ప్రతిభ ఉంటుంది. ప్రవల్లికకు కొత్త విషయాలపై ఎంతో ఆసక్తి ఉంది. ఆ ఆసక్తే ఆమెను 175 కోర్సులు పూర్తి చేసేలా చేసింది. భవిష్యత్తులో తన చదువుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి. 175 కోర్సులు పూర్తి చేయడం అనేది ఆమెకే కాదు విద్యాలయానికి గర్వకారణం' అంటుంది కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగా కుమారి.

టార్గెట్... ఐఏఎస్

ఎంతోమంది ఐఏఎస్ అధికారుల విజయగాథలను క్లాస్ రూమ్‌లో వింటున్నప్పుడు ప్రవల్లిక మదిలో 'ఐఏఎస్' కలకు బీజం పడింది. 'లక్ష్యసాధనకు మన ఆర్థిక స్థితిగతులతో పని లేదు. కడు పేదరికంలో పుట్టిన వారు కూడా ఎంతో కష్టపడి తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. మనకు కావాల్సింది సాధించాలనే పట్టుదల మాత్రమే'... ఇలాంటి మాటలు ఎన్నో ప్రవల్లికకు స్ఫూర్తినిచ్చి 'ఐఏఎస్' లక్ష్యానికి బలాన్ని ఇచ్చాయి.

– సింగారెడ్డి రమణప్రసాద్, సాక్షి, భీమిలి

● టెక్... టాక్



షావోమీ 15 ఆల్ట్రా

డిస్‌ప్లే: 6.73 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 16జీబి ర్యామ్
ఓఎస్: ఆండ్రాయిడ్ 15
ఫ్రంట్ కెమెరా: 32ఎంపీ
బ్యాటరీ: 5410 ఎంఏహెచ్
రిజల్యూషన్: 1440x3200 పిక్సెల్స్



షావోమీ ప్యాడ్ 7 ప్రో

హైట్: 251.22 ఎంఎం; విడ్త్:173.42 ఎంఎం
బరువు: 500 గ్రా. స్క్రీన్ సైజ్: 11.2
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
ఓఎస్: షావోమీ హైపర్ ఓఎస్ 2
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 8850 ఎంఏహెచ్
కలర్స్: గ్రే, బ్లూ, గ్రీన్

గెలాక్సీ ఏ సిరీస్

శాంసంగ్ తన పాపులర్ గెలాక్సీ ఏ సిరీస్ కోసం మూడు కొత్త డివైజ్‌లను యాడ్ చేసింది. అవి: గెలాక్సీ ఏ 56, గెలాక్సీ ఏ 36, గెలాక్సీ ఏ26. గెలాక్సీ ఏఐని మరింత యాక్సెస్ చేసే లేటెస్ట్ మిడ్ రేంజ్ శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లు ఇవి.
గెలాక్సీ ఏ56
8జీబి ర్యామ్: 128 జీబి స్టోరేజ్
గెలాక్సీ ఏ 36 ; 8జీబి ర్యామ్: 128 జీబి స్టోరేజ్



మెరుపు వీరుడు

● గేమింగ్



'కొండలు, కోనలు మనకి అడ్డంకి కాదు' అనుకునే సాహసికులకు స్వాగతం పలికే గేమ్ ఇది.

మిస్టీరియస్ పాయింట్స్‌ను అవగాహన చేసుకుంటూ అనుభవజ్ఞానాన్ని సొంతం చేసుకునే సాధకులకు దారి చూపే గేమ్ ఇది.

గెరిల్లా యుద్ధంలో రాటు తేలిన యోధులకు వీర తిలకం దిద్దే గేమ్ ఇది. యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ అసాసిన్స్ క్రీడ్ షాడోస్ విడుదల అయింది. అసాసిన్స్ క్రీడ్ సిరీస్‌లో వస్తున్న 14వ మేజర్ ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. 16వ శతాబ్దంలో సెంగోకు కాలానికి చెందిన కథ నేపథ్యంలో రూపొందించిన ఈ గేమ్‌లో జపాన్ అంతర్యుద్ధ సంఘటనలు కనిపిస్తాయి. తన శక్తియుక్తులతో టకేడా వంశంపై విజయం సాధిస్తాడు ఓడా నోబునాగా. ఒళ్లు గగుర్పొడిచే యుద్ధాలే కాదు నిలువెత్తు కోటలు, అలంకరించబడిన వాస్తు శిల్పాలు, సందడిగా ఉండే ఓడరేవులు... మొదలైనవి ఎన్నో ఈ ఆటలో కనిపిస్తాయి. రకరకాల మిషన్‌ల ద్వారా వివిధ క్యారెక్టర్‌లకు మారే అవకాశం ప్లేయర్స్‌కు ఉంటుంది. సరికొత్త ఫీచర్‌లతో ప్లేయర్స్‌కు సినిమాటిక్ ఫైటింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

సిరీస్: అసాసిన్స్ క్రీడ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్/ మాక్ ఓఎస్/ఐపాడ్ ఓఎస్
జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్

● ఇడియమ్స్

చ్యూ ద కడ్

ఒక విషయం లేదా సంఘటనకు సంబంధించి లోతుగా ఆలోచించడం, విశ్లేషించడానికి సంబంధించి వాడే మాట... చ్యూ ద కడ్. ఉదా: ఆఫ్టర్ ది మీటింగ్, శ్రీను టుక్ టైమ్ టు చ్యూ ద కడ్ ఆన్ దెయిర్ న్యూ ప్రాజెక్ట్ ప్రపోజల్



ఫోమ్ ఎట్ ద మౌత్

తట్టుకోలేని కోపం, అసహనానికి గురయ్యే సందర్భంలో వాడే మాట... ఫోమ్ ఎట్ ద మౌత్.
ఉదా: ది సీయివో బిగెన్ టు ఫోమ్ ఎట్ ద మౌత్ వెన్ హీ డిస్కవర్డ్ ది ఫైనాన్షియల్ లాసెస్.

సాక్షి సినిమా

ధమ ధమ ధమ విశ్వలింగ...


● మోహన్ బాబు

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రలు పోషించారు. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ మూవీ ఏప్రిల్ 25న విడుదల కానుంది. కాగా మార్చి 19న మోహన్‌బాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా 'కన్నప్ప'లో మోహన్‌బాబు చేసిన మహదేవ శాస్త్రి పాత్ర పరిచయ గీతానికి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. 'ధమ ధమ ధమ విశ్వలింగ... ధిమి ధిమి ధిమి విశ్వ లింగ....' అంటూ ఈ పాట సాగుతుంది. స్టీఫెన్ దేవస్సీ స్వరపరచిన ఈ పాటకు సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించగా శంకర్ మహదేవన్ ఆలపించారు.

నా హృదయం నిండిపోయింది

- చిరంజీవి



''హౌస్ ఆఫ్ కామన్స్-యుకె పార్లమెంట్‌లోని కొందరు పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, అండర్ సెక్రటరీలు, దౌత్యవేత్తలచే గౌరవించబడటం గౌరవంగా భావిస్తున్నాను. నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది'' అని హీరో చిరంజీవి తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కళారంగానికి, సమాజానికి చిరంజీవి చేసిన సేవలకుగానూ యుకె పార్లమెంట్ హౌస్ ఆఫ్ కామన్స్‌లోని కొందరు ఎంపీలు, మంత్రుల చేతులమీదుగా ఈ నెల 19న(బుధవారం) చిరంజీవికి గౌరవ సత్కారం జరిగింది. అలాగే సినిమా, ప్రజాసేవ, దాతృత్వానికి ఆయన చేసిన కృషిని గుర్తించిన యూకేకి చెందిన 'బ్రిడ్జ్ ఇండియా' అనే సంస్థ తొలిసారి అందించిన 'జీవిత సాఫల్య పురస్కారం' కూడా అందుకున్నారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ-''మాటలు సరిపోవు. అద్భుతమైన ప్రేమాభిమానాలను చూపించే అభిమానులు, రక్త దాతలు, నా సినీ కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు, నా ప్రయాణంలో ఎంతగానో సహకరించిన వారు, నేను మానవతా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ థ్యాంక్స్. ఈ గౌరవం నన్ను మరింత ఉత్సాహంతో పని చేయడానికి ప్రేరేపిస్తుంది'' అన్నారు.


● శిరీష్, హర్షిత్, 'దిల్' రాజు, హనీఫ్, హర్షిత, సునీత

మల్టీస్టారర్‌కి శ్రీకారం

ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు 'మార్కో' మూవీ చిత్ర దర్శకుడు హనీఫ్ అదేనితో ఓ మల్టీస్టారర్ మూవీకి శ్రీకారం చుట్టారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించనున్న ఈ కొత్త చిత్రాన్ని గురువారం ప్రకటించారు. ''మలయాళంలో బ్లాక్ బస్టర్ అయిన 'మార్కో'తో దర్శకుడు హనీఫ్ అదేని పేరు బాగా ట్రెండ్ అయింది. అలాంటి ఓ క్రేజీ డైరెక్టర్‌తో హై బడ్జెట్‌తో పాన్ ఇండియా మల్టీస్టారర్ ఫిల్మ్‌ని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఈ మూవీతో హనీఫ్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు. గురు ఫిల్మ్స్ సునీత తాటి ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

భాగ్యనగరం అంతా మనదే మనదే...


● వైష్ణవీ చైతన్య, సిద్ధు జొన్నలగడ్డ

''ఈ పనిని ఇలానే ఎందుకు చేయాలి? మరోలా చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటివాళ్లని క్రాక్ అంటుంటాం. 'జాక్: కొంచెం క్రాక్' రైమింగ్‌తో పాటు హీరో క్యారక్టరైజేషన్ కూడా ఈ సినిమాకు ఈ టైటిల్ పెట్టడానికి కారణం అయ్యింది. ఈ సినిమాలో ప్రేక్షకులను నవ్విస్తూనే, బాధ్యతగా ఉండే పాత్రలో కనిపిస్తాను'' అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జాక్: కొంచెం క్రాక్'. వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'కిస్' పాట లిరికల్ వీడియోను గురువారం రిలీజ్ చేశారు మేకర్స్. 'భాగ్యనగరం అంతా మనదే మనదే...' అంటూ ఈ 'కిస్' సాంగ్ సాగుతుంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ- ''ఈ సినిమాలోని హీరో క్యారెక్టరైజేషన్ గురించి భాస్కర్‌గారు చెప్పగానే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నాను. నేనూ ఓ రైటర్‌ని కాబట్టి కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చాను. భాస్కర్‌గారు ఆయన కథకు అనుగుణంగా డెవలప్ చేశారు'' అన్నారు. ''సిద్ధు యూత్‌కి మాత్రమే కాదు అన్ని ఏజ్‌ల వారికీ స్టార్ బాయ్‌గా మారారు. 'జాక్' సినిమాను భాస్కర్ చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ఈ చిత్రం పాటల రచయిత సనారె, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడారు.


● సత్య యాదు, రామ్‌గోపాల్ వర్మ, ఆరాధ్య, గిరి కృష్ణకమల్

శారీ చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు

- రామ్‌గోపాల్ వర్మ

''సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలు షేర్ చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది? అనే నేపథ్యంలో 'శారీ' రూపొందింది. నేనీ చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. 'శారీ'లో సందేశం ఉంటుందని చెప్పను గానీ, ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు'' అని రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. సత్య యాదు, ఆరాధ్యా దేవి ప్రధాన పాత్రల్లో గిరి కృష్ణ కమల్ దర్శకత్వం వహించిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై రవిశంకర్ వర్మ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ- ''రాజకీయాలు, సినిమాలు వేర్వేరు. ఆంధ్రప్రదేశ్‌లో మా సినిమాకు థియేటర్స్ దొరకవని అనుకోవడం లేదు. ఏదైనా చట్ట ప్రకారమే జరుగుతుంది. పోసాని కృష్ణమురళిగారిని అరెస్ట్ చేస్తే ఆయన సినిమాలు ఆపేయరు కదా? తాము చేస్తున్న యాడ్స్ లీగలా? కాదా? అనేది యాక్టర్స్‌కు, స్టార్స్‌కు తెలియకపోవచ్చు. దానిపై అధికారులు నటీనటులకు అవగాహన కల్పించాలి. అంతేగానీ సడెన్‌గా చర్యలు తీసుకోవడం సరికాదు'' అన్నారు. ''ఆరాధ్య, సత్య బాగా నటించడం వల్ల దర్శకుడిగా నాపై ఒత్తిడి తగ్గింది'' అని గిరి కృష్ణకమల్ చెప్పారు. ''ఈ సినిమాలో నా పాత్ర చిన్నదే అయినా కథలో కీలకంగా ఉంటుంది'' అని సత్య యాదు తెలిపారు.

వినోదాల సింగిల్


● శ్రీవిష్ణు, కేతికా శర్మ

శ్రీవిష్ణు హీరోగా రూపొందుతోన్న చిత్రం '#సింగిల్'. 'నిను వీడని నీడను నేనే' మూవీ ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇవాన, కేతికా శర్మ హీరోయిన్లు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్‌పై విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని మే 9న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరించే చిత్రంగా 'సింగిల్' ఉంటుంది. ఈ వేసవిలో శ్రీవిష్ణు తన నవ్వులతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఆయన పాత్రలోని రెండు డిఫరెంట్ వేరియేషన్స్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమేరా: ఆర్. వేల్‌రాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

ఆ ఉద్దేశంతోనే ఈ ఫంక్షన్‌కి వచ్చాను

- బ్రహ్మానందం


● ప్రియాంక, బ్రహ్మానందం, సప్తగిరి

''తమ్ముడు సప్తగిరి సినిమా ఇది. ఒక హాస్య నటుడు సినిమా హిట్ కావాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాను'' అన్నారు బ్రహ్మానందం. సప్తగిరి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ఈ చిత్రంలో ప్రియాంకా శర్మ హీరోయిన్. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో కేవై బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందం మాట్లాడుతూ- ''ప్రేక్షకులను పది కాలాల పాటు నవ్వించాలని తపన పడేవాడు హాస్యనటుడు. హాస్య నటుడిది మనల్ని నవ్వించే వృత్తి. నిజంగా ఇది పవిత్రమైనది. 'పెళ్లికాని ప్రసాద్' సినిమా కోసం సప్తగిరి చాలా కష్టపడ్డాడు. ఈ సినిమాను హిట్ చేసి, హాస్య నటుడికి మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ఈ సినిమా కాన్సెప్ట్ బాగుంది'' అని మరో ముఖ్య అతిథి, దర్శక-నిర్మాత మారుతి తెలిపారు. ''ఈ సినిమాను తప్పకుండా థియేటర్స్‌లో చూడండి'' అని పేర్కొన్నారు కేవై బాబు.

కోర్ట్ విజయం మాకు హెల్ప్ అవుతుంది

- రాహుల్ రెడ్డి



''కొత్తదనంతో కూడిన మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని నిర్మాతగా నా నమ్మకం. మంచి కంటెంట్‌తో రూపొందించిన మా 'టుక్ టుక్' విజయం పై నమ్మకం ఉంది'' అని రాహుల్ రెడ్డి అన్నారు. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య తారలుగా సి. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ రెడ్డి మాట్లాడుతూ- ''దర్శకుడు సుప్రీత్‌తో కలిసి 'అలనాటి చిత్రాలు' అనే వెబ్ ఆంథాలజీ చేశాను. సుప్రీత్ చెప్పిన ఫ్యాంటసీ థ్రిల్లర్ కథ నచ్చడంతో 'టుక్ టుక్' నిర్మించాను. రెండున్నర గంటల పాటు నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేసే ఫిల్మ్ ఇది. రోషన్ నటించిన 'కోర్ట్' సినిమా మంచి విజయం సాధించింది. ఆ సినిమా సక్సెస్ మాకూ హెల్ప్ అవుతుందని ఆశిస్తున్నాను'' అని అన్నారు.